క్లుప్తంగా

పేదలకు వరం సీఎం సహాయనిధి



బాధితుడికి రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని ముత్రాసకాలనీకి చెందిన నాయకుల గంగప్ప అనే బాధితుడికి ఆదివారం రూ.3 లక్షలు విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. విప్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని సత్వరం ఆదుకునే గొప్ప గుణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీలక్ష్మి, వార్డ్ ఇన్‌చార్జ్ ఆనందరాజ్, సచివాలయాల కన్వీనర్ బుజ్జి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మరాజు, నాయకుల పరమేశ్వర, దుగ్గన్న పాల్గొన్నారు.

నేడు గుండె వైద్య శిబిరం

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం కిమ్స్ సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ నాగరత్నమ్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వడ్డే చంద్ర ఆదివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించే గుండె వైద్య శిబిరాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండ్ల తోటల పరిశీలన



బండమీదపల్లిలో పండ్లతోటను పరిశీలిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్

కుందుర్పి: మండలంలోని కుందుర్పి, నిజవల్లి తదితర పంచాయతీల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో రైతుల మెట్ట భూముల్లో సాగు చేసిన వివిధ రకాల పండ్లతోటలను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ పర్యవేక్షణలో జంబుగుంపల, అప్పిలేపల్లి, మలయనూరు, మహంతపురం తదితర పంచాయతీల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పండ్లతోటలు పెంపకానికి తోడ్పాటు నందించామన్నారు. అలాగే జంబుగుంపల, నిజవల్లి పంచాయతీల్లో రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, స్పెయిన్ స్పాన్సర్ ఫెర్నండో తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ

రాయదుర్గంటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి సరఫరా పథకం పైప్‌లైన్‌కు ఆదివారం భారీ లీకేజీ ఏర్పడింది. ఎస్ఎస్ ట్యాంకు వద్ద నుంచి రా వాటర్ సరఫరా చేసే పైప్‌లైన్‌కు కణేకల్లు క్రాస్ వద్ద లీకేజీతో మరమ్మతుకు నోచుకుంది. మున్సిపల్ నీటి సరఫరా విభాగం సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టారు. ఈ కారణంగా పట్టణంలో రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మరమ్మతులు పూర్తయిన తక్షణం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

అదుపులోకి వచ్చిన పొగ కాలుష్యం



డంపింగ్ యార్డులో పొగ కాలుష్యం పూర్తిగా అదుపులోకి వచ్చిన దృశ్యం

రాయదుర్గంటౌన్: దాదాపు నాలుగైదు రోజుల తరువాత పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డులో పొగ కాలుష్యం అదుపులోకి వచ్చింది. నిప్పంటుకుని భారీస్థాయిలో చెత్త తగలబడిన విషయం తెలిసిందే. కానీ పొగ విపరీతంగా వస్తూ పరిసరాల్లో తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్న విషయాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పరిశీలించి అనంతపురం, బళ్లారి, చిత్రదుర్గం జిల్లా కలెక్టర్లతో మాట్లాడి అదనంగా ఫైర్ ఇంజన్లను రప్పించి పొగ పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చేందుకు చర్యలు చేపట్టారు. శనివారం దాదాపు 80 శాతం పొగ వెదజల్లకుండా ఫైర్‌సిబ్బందితోపాటు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కృషి చేయగా ఆదివారం హిటాచితో చెత్త కుప్పలను దూరం చేస్తూ కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండకు చెందిన ఫైర్ ఇంజన్లతో పొగను పూర్తిగా కంట్రోల్ చేశారు. పొగ కాలుష్యం పూర్తిగా అదుపులోకి వచ్చేందుకు ప్రభుత్వ విప్ చొరవతో పాటు అధికారులు, అగ్నిమాపక సిబ్బందికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

మంచిచేసే ప్రభుత్వానికి మద్దతివ్వండి

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజక వర్గాల్లోని అన్ని మండలాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. అలాగే ప్రతి ఇంటికీ 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను అతికిస్తున్నారు.

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి స్పందన



రాయదుర్గం: జగనన్నే మా భవిష్యత్ కరపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కంబదూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకల్లు/ఉరవకొండ/ఉరవకొండ రూరల్/కూడేరు/వజ్రకరూరు/విడపనకల్లు: అర్హతే ప్రామాణికంగా పైసా అవినీతికి తావులేకుండా కులమతాలు, పార్టీలు చూడకుండా నేరుగా ఇంటిగుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని ముత్రాసకాలనీ వద్ద 'జనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ శ్రీలక్ష్మి, సచివాలయాల కన్వీనర్ బుజ్జి, గృహసారథులు, వలంటీర్లు, వార్డు కన్వీనర్లతో కలసి విప్ ఇంటింటికెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గడిచిన ఐదేళ్ల టీడీపీ హయాంలో ఎంత లబ్ధిపొందారు..? ఈ నాలుగేళ్ల మనందరి ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిపై ఓ సారి బేరీజు వేసుకోవాలన్నారు. మీ సంక్షేమం, మీ బిడ్డల భవిష్యత్తు కోసం సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా నేరుగా ప్రజల ఖాతాలకే 2.96 లక్షల కోట్లు చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. మంచిచేసే ప్రభుత్వానికి మీరంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. నీరు–చెట్టు, దోమలపై దండయాత్ర, రెయిన్‌గన్ల పేరుతో రూ.వేల కోట్లు దోచేసిన నీచ చరిత్ర టీడీపీ నాయకులదని విప్ కాపు విరుచుకుపడ్డాడు. చంద్రబాబులాంటి దుర్మార్గులను నమ్మితే తినేకూటిలో మట్టివేసుకున్నట్టేనని హెచ్చరించారు. జగన్ అంటేనే నమ్మకం, భరోసా అని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు తిమ్మరాజు, ఆనందరాజ్ పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్ మండలంలోని కల్లుహోళ, ఉద్దేహాళ్ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వీరన్నగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, సోమనాథ్‌గౌడ్, నబీసాబ్, విశ్వనాథ్‌రెడ్డి, రవి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.
- కణేకల్లు మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మండల సచివాలయ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి పాల్గొన్నారు.
- ఉరవకొండ పట్టణంలోని 1, 2, 3, 4, 5 సచివాలయల పరిధిలోని వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ బళ్లారి ఆసీఫ్, గృహసారథులు అన్వర్, పద్మావతి, ఈడిగప్రసాద్, భీమా, బేల్దార్ శర్మాస్, జోగి విజయ్‌లు, ఎంపీపీ చంద్రమ్మ, ఉప సర్పంచ్ వన్నప్ప, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ సుంకన్న, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.
- కూడేరు మండలంలోని కొర్రకోడులో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు వడ్డే గంగాధర్ , లక్ష్మి , సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలోని వజ్రకరూరు, ధర్మపురిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, సచివాలయ కన్వీనర్ రాకెట్ల బాబు, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లబోతుల కిరణ్, కార్యదర్శి ప్రభుదాస్, సీనియర్ నాయకుడు రామాంజనేయులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు హనుమంతరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఎంఎల్ఓ తేజేశ్వరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచు వైద్యనాథరెడ్డి, నాయకులు మహానందరెడ్డి, హను మంతురాయుడు, సచివాలయ కన్వీనర్లు ఈశ్వరమ్మ, రామచంద్ర పాల్గొన్నారు.
- విడపనకల్లులో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు బి.సుంకన్న, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఉలిగప్ప, రాజమ్మ, వీరన్న, సుంకన్న, నాగరాజు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం, అభివృద్ధి మాటే

- మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు/కళ్యాణదుర్గం/శెట్టూరు/బ్రహ్మసముద్రం: గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రతి ఇంటా, ప్రతి నోటా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి మాటే వినిపిస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం కంబదూరు మండల కేంద్రంలోని చెక్‌పోస్టు ప్రాంతంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో జరుగుతున్న మంచి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే గత చంద్రబాబు ప్రభుత్వ పాలనకు ప్రస్తుత జగనన్న పాలనకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని, అందుకే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాణి అనే మహిళ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాము ఒక్క పథకం ద్వారా కూడా లబ్ధి పొందలేదని, జగనన్న సీఎం అయ్యాక అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా తదితర పథకాల ద్వారా లబ్ధి పొందామని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయాల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీలు కుమార్, మల్లేష్, సోమశేఖర్, యువజన నాయకుడు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, సచివాలయ కన్వీనర్లు రామస్వామి, కిరణ్, నాయకులు విల్సన్, రాజు, లోకేష్, అబ్బాస్, ఫయాజ్, నగేష్, క్రాంతి, జెక్కిరెడ్డిపల్లి ఈరన్న,విద్యార్థి విభాగం నాయకుడు శ్రీకాంత్ తదితరు పాల్గొన్నారు.

- కళ్యాణదుర్గంలోని 12వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ తిరుమల చంద్రమ్మ, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. అలాగే 9వ వార్డులో సచివాలయ కన్వీనర్లు ఉమేష్ రెడ్డి, షేక్షావలి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్రరెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.
- శెట్టూరు మండలంలోని చెర్లోపల్లి, యాటకల్లు, చిన్నంపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి , జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడుసోమశేఖర్, చెర్లోపల్లి, యాటకల్లు సర్పంచ్‌లు విరుపాక్షి, ఈరన్న, మాజీ ఎంపీపీ రామభీమప్ప, నాయకులు ముచ్చర్లపల్లి నవీన్, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.
- బ్రహ్మసముద్రం మండలంలోని భైరసముద్రం, పాలవెంకటాపురం, ఎస్ కొండాపురం, ముప్పలకుంట, కన్నేపల్లి పంచాయతీల్లో మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వీరశైవలింగాయత డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్‌నాయక్, సర్పంచ్ ప్రేమ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, అయ్యన్న, తిమ్మారెడ్డి, లక్ష్మీప్రసాద్, విజయ్, రాము, బొజ్జప్ప, రవికుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడోత్సవం చేపట్టారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవం చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఈఓ అంగడాల క్రిష్ణయ్య, ప్రధాన అర్చకుడు నరసింహమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా సోమవారం సాయంత్రం స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

వజ్రకరూరు: పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఆదివారం సాయంత్రం జనార్దన వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు వారిని శాలువాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధురెడ్డి, గ్రామ కా ర్యదర్శి శ్రీధర్‌రావు, యువజన విభాగం కార్యదర్శి శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి శయనోత్సవ వేడుక

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభ జంబుకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామి సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవాన్ని అర్చకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకు ముందు స్వామికి ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, జితేంద్ర, భక్తులు పాల్గొన్నారు.

పోలీసులకు అభినందనలు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామంలో ఇటీవల జరిగిన మారికాంబదేవి కొల్లాపుర మహాలక్ష్మీ దేవి గ్రామోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన ఎస్ఐ శివ, పోలీస్ సిబ్బందిని గ్రామస్తులు ఆదివారం అభినందించారు. సర్పంచ్ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.

విద్యుదాఘాతంతో ఎనుములు మృతి



ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల గ్రామంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రైతు మంగలి గోపాల్‌కు చెందిన రెండు ఎనుములు ఆదివారం మృతి చెందాయి. గ్రామ సమీపంలో మేత మేయడానికి వెళ్లిన ఎనుములకు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుత్ షాక్‌తో రెండు ఎనుములు అక్కడి అక్కడే మృతి చెందాయి. రైతుకు రూలక్ష వరకూ ఆస్తి నష్టం జరిగింది. సర్పంచ్ యోగేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎనుములు మృతి చెందాయన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ



కళ్యాణదుర్గం: సందేశం ఇస్తున్న పాస్టర్ నారాయణ పాల్



రాయదుర్గంటౌన్: జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్‌లో ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/కంబదూరు/రాయదుర్గం టౌన్: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే రోజు మరణించిన ఏసుక్రీస్తు ఈస్టర్ రోజున సమాధి నుంచి తిరిగి లేచాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. కళ్యాణదుర్గం పట్టణంలోని సీఅండ్ఐజీఎం, హోసన్నా, కల్వరి, విక్టరీ తదితర చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశాలను వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే కంబదూరులోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో పాస్టర్ జేమ్స్,సంఘ పెద్దలు ప్రభాకర్ ,జోషఫ్‌రెడ్డి, జోయెల్, విల్సన్, జయరాజు, కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గం పట్టణంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా చేపట్టారు. పట్టణంలోని క్రైస్ట్ చర్చి, సెయింట్ మేరీ చర్చి, జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్, డాక్టర్ ఎస్ఆర్ జాన్ మెమోరియల్ బాపిస్టు చర్చి, ఎఫ్రాత ప్రార్థన మందిరం, గిల్గాలు చర్చి, కింగ్ ఆఫ్ షాలెమ్ క్రైస్ట్ చర్చి, బ్రదరన్ అసెంబ్లీ, హోసన్న ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని వివరించారు.

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి



శెట్టూరు: ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళితులు



ఉరవకొండ: కోనాపురంలో ఫెర్రర్ చిత్రటానికి నివాళులర్పిస్తున్న విదేశీయులు



గుమ్మఘట్ట: గోనబావి ఆర్డీటీ పాఠశాలలో ఫాదర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/శెట్టూరు/కంబదూరు/ఉరవకొండ/వజ్రకరూరు/బొమ్మనహాళ్/విడపనకల్లు/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట: పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా సంస్థ ఉద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. స్పందించు సాయ మందించు కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సేవా హుండీలను పగులగొట్టి వచ్చిన సొమ్మును లెక్కించారు. ఆ నగదును ఇండియా ఫర్ ఇండియాకు జమ చేయనున్నట్లు ఆర్డీటీ అధికారులు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ గృహాలు, వైద్యం, విద్య, తాగునీరు వంటి రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించి అట్టడుగు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసి వారి జీవితాల్లో మార్పులు తీసుకువచ్చి జీవన ప్రమాణాలను పెంపునకు కృషిచేసిన దేవుడని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కోల్డ్‌వార్?



కూడేరు: ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ మెడికల్ లీవ్‌పై వెళ్లడం వెనుక, రీసర్వే వింగ్ అధికారికి ఆయనకు మధ్య కోల్డ్‌వారే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 1 నుంచి 15 వరకూ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. రీసర్వే వింగ్ అధికారిని నమ్మి డిజిటల్ కీ ఇస్తే.. తన ప్రమేయం లేకుండానే కొన్ని భూవివరాలను ఆన్‌లోన్‌కి ఎక్కించడం, తొలగించడం చేశాడని మధుసూదన్ సిబ్బంది, ఉన్నతాధికారులతో వాపోయినట్లు తెలిసింది. ఆ అధికారి కింది స్థాయి సిబ్బందిపై ఆధిపత్యం చలాయిస్తుండడంతో కొందరు వీర్వోలు లోలోపలే మధనపడుతున్నట్లు సమాచారం. ఇలానే ఒత్తిళ్లు అధికమైతే సెలవులో వెళ్లేందుకు వీర్వోలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ అధికారులను నియమించి, ఇబ్బంది లేకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీఓ మధుసూదన్ మాట్లాడుతూ అధికారుల మధ్య సఖ్యత లేనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయామన్నారు. మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ అధికారుల ఏర్పాటుకు చర్యలుతీసుకుంటామన్నారు.

కుడి కాలువలో కొనసాగుతున్న నీటి ప్రవాహం



కూడేరు: గతంలో ఎన్నడూ లేని విధంగా పీఏబీఆర్ డ్యాం నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. గత ఏడాది ఊహించని రీతిలో వర్షాలు కురవడం, పీఏబీఆర్ డ్యాంలోకి రికార్డు స్థాయిలో నీరు చేరడమే ఇందుకు కారణం. ఎనిమిది నెలలుగా కుడి కాలువకు ఇరిగేషన్ అధికారులు నీటిని సరఫరా చేస్తునే వస్తున్నారు. కుడి కాలువ చరిత్రలో ఇన్ని నెలల పాటు నీటి విడుదల సాగింది లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే తొలిసారి. గత ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ 25 వరకు నీటిని వదిలారు. కొద్దిరోజులు విరామం ఇచ్చి జనవరి 5న మళ్లీ నీటిని విడుదల చేయగా.. నీటి ప్రవాహం ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉంది. డ్యాం నుంచి ధర్మవరం వరకూ కుడి కాలువ 112 కిలో మీటర్లుంది. కాలువ కింద 49 చెరువులున్నాయి. ఎండా కాలంలో సైతం కుడి కాలువలో నీరు ప్రవహించడంతో కాలువకు ఇరువైపులా, చెరువుల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీటి కొరత ఉండదని ధైర్యంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ధర్మవరం కుడి కాలువ మీదుగా ప్రస్తుతం 115 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

దుర్గం టీడీపీలో రాజుకుంటున్న విభేదాలు..!

- లోకేష్ పాదయాత్రతో బహిర్గతం
- పోటాపోటీగా వాహన ప్రదర్శనలు



రాయదుర్గం: రాయదుర్గం టీడీపీ నాయకుల్లో విభేదాలు రాజుకుంటున్నాయి. పైకి అంతా బాగున్నట్లు కనిపిస్తున్నా లోలోపు నివురుగప్పిన నిప్పులా.. ఒకరిని చూస్తే మరొకరు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. గ్రూపులుగా విడిపోయిన నేతలు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు. తాజాగా లోకేష్ పాదయాత్ర సందర్భంగా అసంతృప్త జ్వాలలు మరోసారి ఎగిసిపడ్డాయి. పాదయాత్రకు ఎవరికి వారు పోటాపోటీగా వాహనాలు ఏర్పాటు చేయడం చూస్తే నియోజకవర్గంలో తీవ్ర చర్చలకు దారి తీసింది. ఈ సారి ఎమ్మెల్యే టిక్కెట్ స్థానికులకే దక్కాలనేది పార్టీలోని మెజార్టీ సభ్యుల వాదన. ఇప్పటికే ఈ ప్రతిపాదనను లోకేష్‌తో సన్నిహితంగా మెలిగే ఓ ముఖ్య నాయకుడు చెప్పినట్టు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ స్థాపించినప్పటి నుంచి జెండాలు మోసేందుకు తప్పా పదవులు అనుభవించేందుకు ప్రాప్తిలేదా..? అంటూ కొందరు నేతలు లోలోపే కుమిలిపోతున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు ముఖ్య నాయకుడి ఒంటెద్దు పోకడ నచ్చక కీలక పదవులు అనుభవించిన నేతల్లో చాలా మంది పార్టీకి దూరంగా ఉండిపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు నీరు–చెట్టు, ఇతర కాంట్రాక్ట్ పనుల్లో రూ.కోట్లు కూడగట్టుకున్న వాళ్లు మొదలు బలమైన సామాజిక వర్గాలన్నీ స్తబ్దతగా ఉండిపోతుండడం పార్టీకి తలపోటుగానే మారిందనే చెప్పుకోవచ్చు. ఇదిలా ఉండగా లోకేష్ పాదయాత్ర షెడ్యూల్ చూసే మరో కీలక నేత కూడా ఈ సారి తప్పక రాయదుర్గం నుంచి బరిలో ఉంటాడనే ప్రచారం ఊపందుకుంది. తన అనుచరులు గట్టిగా ఈ వాణి వినిపిస్తుండడంతో క్యాడరంతా ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తెలియక డైలామాలో పడ్డారు.

ఎంపీ అభ్యర్థిగా పంపుతారంటూ ప్రచారం..?

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా లేదా గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపే అవకాశం ఉందని నియోజకవర్గంలో జోరుగా చర్చలు మొదలయ్యాయి. ఈ వాదనలు క్రమంగా బలపడడంతో నేతల మధ్య మాటల వైరం మొదలైనట్టు కనిపిస్తోంది. లోకేష్ పాదయాత్రలో కీలకంగా చెప్పుకునే ఈ ముగ్గురు నేతల్లో అలక ఉన్నట్టు కార్యకర్తల్లో స్పష్టంగా కనిపించింది. ఇద్దరు నేతలు అప్పుడప్పుడు మాట్లాడుతున్నట్టు కనిపించినా ముఖ్య నాయకుడు మాత్రం పూర్తిగా దూరంగా ఉండిపోయాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా లోకేష్ పాదయాత్ర వల్ల నేతల మధ్య నెలకొన్న అంతర్గత పీటముడి మరింత ముదిరినట్టైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.